

# జీవన్

■ సి. సుజాత
■ చిత్రాలు: కాళ్ళ

వేళ్ళ సందుల్లోంచి ఇసుక జారిపోయినట్లు చూస్తూ చూస్తూ ఉండగానే జీవితం మొత్తం చేజారుతున్నట్లే ఉంది. తెల్లవారేసరికి ఇదంతా ముగిసిపోతుందా? ఇంకేవీ ఉండవా? ఏ జ్ఞాపకాలూ మిగలకుండా, హృదయం పైన ఏ ముద్రలూ లేకుండా నేనొక్కదాన్నే ఈ విశాలమైన ఆకాశం నీడలో ఉండిపోతానా? అక్టోపస్‌లా చేతులు జాస్తున్న ఈ నాలుగు గోడల మధ్య నేనిమిడిపోకపోవడం తప్పేనా?".

విమల కిటికీ లోంచి బయటికి చూసింది. దీపాల వెలుగు నీడలు పరుచుకొంటున్న రోడ్లన్నీ నిర్మానుష్యంగా నిశ్శబ్దంలో, ఒంటరితనంలో...

విమల తల విదిలించి వచ్చి సోఫాలో కూర్చుంది. ఎదురుగా సర్దేసి ఉంచిన పెద్ద సూట్‌కేస్. విమల దృష్టి పుస్తకాల పైకి పోయింది. ఎప్పటిలాగే కొత్త పుస్తకాల వాసన చూస్తూ పేజీలు తిప్పాలని అనిపించలేదు. అనాసక్తంగా చూస్తూ ఊరుకొంది. గోడకి ప్రకాష్ చొక్కాలు వేలాడుతున్నాయి. హేంగర్ల నిండా అన్ని షర్టులు ఎప్పుడూ ఉండవు. ఎప్పటికప్పుడు తానే ఉతికించీ, వండీ, అతని మూడ్స్ కనిపెట్టీ... ఏమిటిది? ఎక్కడ తన ఉనికి!

విమల కాళ్ళ వంక చూసుకొంటూ కూర్చుంది.

తాను మంచి నిర్ణయం తీసుకొందా?

ప్రకాష్ పెదవుల స్పర్శ వద్దన్నా గుర్తొస్తోంది. గునగునమనే గొంతు చెవుల పక్కనే వినిపిస్తోంది. మెదడులో అలజడి శరీరం మొత్తం ఊపేస్తోంది. తనకు కావలసింది ప్రకాష్‌తో శృంగారమేనా?

'విమ్మీ, ఎక్కడిది ఈ జ్వాల? అలా సముద్రం లాగా ఎలా పొంగుతావే. ఇది శరీరం కాదు. విరిగిపడే వ్యామోహ కెరటం...'

ప్రకాష్ ఆశ్చర్యానికి తాను కిలకిలమంటుంది. ఆ గదిలో ఒక యౌవన కాంత. అందుట్లో మునిగి పోతూ, తేరుకొంటూ తనివి తీరని కాంక్షా తీరాల్లోకి తామిద్దరూ.

అతను ప్రతీ నిమిషం తనతో ఉండాలని తానెప్పుడూ అనుకోనేలేదు. మాటల కందని భాష. తామిద్దరి మధ్యా ఏదో ఉంది. తాను కోరుకొన్న క్షణం తనతో ప్రకాష్ ఉన్నాడు- అంతే.

కానీ, ఇప్పుడేమంటాడు ప్రకాష్? తనను ఏమని అడుగుతున్నాడు? "విమలా నీవు నాకు సమాధానం ఇవ్వలేదు. ఇలా నాకు సరిపోదు. నాకు శాశ్వతంగా ఒక తోడు కావాలి. నాతో ఉండి ఒక కప్పు కింద కలిసి బతకాలి. నాకు పిల్లలు కావాలి. ఏదో లోటుగా ఉంది. లోన్లీగా ఉంది. నా ఉద్యోగం టూర్లు, మనిద్దరం అఫీషియల్‌గా మాట్లాడుకోవడం, ఫోన్ పైన అరేంజ్‌మెంట్లూ, ఇద్దరికీ తీరిక ఉంటే కలుసుకోవడం... ఇదంతా నాకు బాగా లేదు. నాకు నువ్వు ఫుల్ ఫ్లెడ్జ్‌డ్‌గా కావాలి."

తనకి అర్థం అవుతోంది. నవ్వూ వస్తోంది. ఇలాటి కబుర్లు తరచూ తమ మధ్య వస్తూనే ఉన్నాయి.

"విమలా, ప్లీజ్ మనం పెళ్ళాడదాం..."

"అంటే, ఉద్యోగం వదిలేసి నీకు వంట చేసిపెట్టాలా?"

"అలా అనకు. కేవలం వంటేనా... అదేం కాదు."

"మరింకేదీ. ఇప్పుడు నిన్ను మేపడం లేదా? నీ పన్లు చేయడం లేదా? నిజం చెప్పు. నీ పనులు సగం పైన నేనే చేయనూ..."

"ప్లీజ్ విమలా! నా మాట విను."

"ఇంకో మాట చెప్పు ప్రకాష్. నా ప్రాజెక్ట్ పని, టూర్లు, ఉద్యోగం - ఇవన్నీ వదిలేసి... ఏయ్ ప్రకాష్ నాకు తెలుసు, నా కోసం ఉచ్చులు వేస్తున్నావు."

అతని మెడ పట్టుకుని వేళ్ళాడింది విమల.

ప్రకాష్ బలవంతంగా ఆమె చేతులు విడదీశాడు.

"విమలా! నేను సీరియస్‌గా చెబుతున్నా. పెళ్ళి తప్పదు." విమల అతన్ని వదిలేసి దూరంగా జరిగింది.

"అదంతా కుదరదని ముందే మాట్లాడుకున్నాం. ఉయ్ లివ్ టుగెదర్. అంతే."


ప్రకాష్ విసురుగా వెళ్ళి డోర్ దగ్గర నిలబడ్డాడు.

"మనిద్దరి మధ్యా కాంట్రాక్టు కంటే ముందు ప్రేమ కూడా ఉంది విమలా. మనం మెషీన్లం కాదు, మనుషులం. పోనీ, ఆ కొత్త మోజులో అర్థం కాలేదు. ఏ లంపటమూ లేకుండా హాయిగా ఉందనిపించింది. ఇందులో లోటు నాకు ఇప్పటికి తెలిసింది. నువ్వా ఆలోచించుకో. నీకు నచ్చకపోతే నేను ఇంకో అమ్మాయిని పెళ్ళాడతాను."

ప్రకాష్ మొహం తిప్పుకోవడం చూసి విమలకు నవ్వొచ్చింది. "మూడేళ్ళ తరువాత ఇప్పుడు జ్ఞానోదయం అయిందా? నేను కాక నీ జీవితంలో ఇంకో అమ్మాయి. ఓహో ఆవిడతో అచ్చం నాతో ఉన్నట్లే ఉండగలవా? పోనీ, ఇప్పుడు నేనెక్కడ ఉన్నానో చూపించు."

ప్రకాష్ దగ్గరగా వచ్చి అతని గుండెలపై తట్టింది విమల. ఆమె చేయి తీసేశాడు ప్రకాష్.

"జరుగుతుంది విమలా. అన్నీ జరుగుతాయి. నేను ఎవరో ఒకర్ని పెళ్ళాడుతాను. నెమ్మదిగా నిన్ను మరచిపోతాను. విమలా, ఊఁ అను విమలా. ఇప్పటికైనా చెప్పు విమలా." అతను ప్రాధేయపడుతుంటే విమల గోడకు ఆనుకొని నిలబడింది.



# ట్రాక్?

ఈ సంభాషణలు ఎన్నోసార్లు వస్తున్నాయి. ప్రకాష్ తన పట్ల పొసెసివ్‌గా ఉండడం తనకు నచ్చుతుందా? ఇతను తననెందుకు బంధించాలని చూస్తున్నాడు?

"ప్రకాష్! ప్లీజ్, అర్థం చేసుకో. చిన్నప్పటి నుంచి నేనెంతో చూశాను. మా అమ్మ, అత్త, అక్క – అందరూ పెళ్ళిళ్ళు చేసుకొన్నవాళ్ళే. కుటుంబం వాళ్ళ జవజీవాలను ఎలా లాగేసిందో నాకు బాగా తెలుసు. ఆ ఉచ్చులో చిక్కుకుని వాళ్ళు బయటికి రాలేకపోయారు. మా అమ్మ... తలుచుకొంటే భయం వేస్తోంది. మా నాన్న రిటైర్‌మెంట్ తరువాత ఆయన ఎంత తీరికైన జీవితం కోరుకొని అనుభవించాడో, ఆవిడ అంత ఇరుక్కుపోయింది. మా చిన్నప్పుడు ఉన్న పని కంటే ఆయన తీరిగ్గా, విశ్రాంతిగా ఇంట్లోనే ఉన్నప్పుడు ఆవిడ రెట్టింపు పని చేయవలసి వచ్చేది. పనితో విసిగి, అలసి ఆవిడ మానవత్వం చచ్చిపోతూ ఎలా కోపిష్టిగా మారిందో నేను చూశాను. ఆవిడకు స్నేహితులు లేరు. బంధువుల ఇళ్ళకు వెళ్ళడం నాన్నకు ఇష్టం లేకపోయేది. ఆయన ఎక్కడకీ వెళ్ళకుండా ఇంట్లోనే హాయిగా గడపాలనేవారు. ఆయనకు హాయిగా అనిపించింది అమ్మకు నరకం అయింది. చివరికి ఎవరేనా ఇంటికి వచ్చినా, వాళ్ళకు సంతోషంగా కాఫీ ఇవ్వడం కూడా విసుగనిపిస్తోందనేది. ఇల్లు ఆవిడను మింగేసింది. ఆవిడ సర్వశక్తులూ లాగేసింది. ఆవిడ చివరి రోజు వరకూ ఆ కుటుంబం కోసం పని చేస్తూనే ఉండవలసి వచ్చింది."

ప్రకాష్ ఇదంతా వినేవాడు. నిజాన్ని అర్థం చేసుకోవలసి రావడం అతనికి ఇష్టం కాలేదు.

"మన ఇంట్లో మనం మీ అమ్మా, నాన్న లాగా ఉండం గదా విమలా. జీవితం సరిగ్గా షేర్ చేసుకొందాం. నా హామీ. పోనీ, ఇది చెప్పు. పెళ్ళి కూడా సెక్స్ గురించే కదా. నువ్వు కుటుంబం వద్దనుకొన్నావు గానీ, ఇదెందుకు వద్దనుకోలేదు. నీ దోస్త్ నళినిలాగా ఉండకపోయావా!"

అతని గొంతులో ఎగతాళికి విమలకు కోపం వచ్చింది. మాట్లాడకుండా ఊరుకొంది.

"నళిని లాగానా." అది అచ్చం ప్రకాష్ లాగే ఉంటుంది. ప్యాంటూ, షర్టుతోసహా. ప్రకాష్ ఇల్లులాగే దాని ఇల్లూ చెత్తగా ఉంటుంది. పని అంటే ఉద్యమం కోసం పని చేయడమే. అస్తమానం పాంప్లెట్లూ, ప్రెస్ మీట్లూ, మీటింగ్‌లూ, బ్యానర్లూ. దాని దృష్టిలో అన్నీ బోర్. ఆకలేస్తే ఇంట్లోంచి, పని లోంచి బయట పడి ఏ టీ స్టాల్ దగ్గరో దొరికింది తిని హాయిగా పడుకొంటుంది. దాన్ని అందరూ ఎండిపోయిన మనిషి అంటారు. 'రసావేశం లేకుండా, ఏ బాయ్ ఫ్రెండూ, పెళ్ళీ పెటాకులూ లేకుండా అలా ఉండడం ఏం బాగుంటుందో' అంటారు ఫ్రెండ్స్.

"నన్ను చంపకండి. నాకే ఫీలింగ్సూ లేవు. ఇంకో జీవితం నాకు కుదరదు" అంటుందా పని రాక్షసి.

"మాట్లాడు." ప్రకాష్ అసహనంగా అరిచాడు.

"ఆ నళిని లాగా ఎందుకు ఉండవు నువ్వు?"

"ఏమని మాట్లాడను. నాకు నీ ప్రేమ సాహచర్యం కావాలి. పిల్లల్ని కనాలని నేను అనుకోలేదు. కెరీర్ ముఖ్యం నాకు. అసలా కుటుంబం నా ఆలోచనల్లోనే లేదు. నేను మామూలు గృహిణిగా ఆ ఇంటికి పరిమితం కాలేను. నన్ను వదిలేయి ప్లీజ్."

"సరే, వదిలేస్తున్నా ఫో. నువ్వు పిలవగానే వచ్చి నీ కోర్కెలు తీర్చి, అలా ఏం జరగనట్లు... నడిచిపోయే ఓపిక నాకు లేదు. నీ స్నేహం నాకు శాశ్వతంగా సొంతం కావాలి."

ప్రకాష్ విసురుగా వెళ్ళిపోయాడు.

విమల నిర్ఘాంతపోయి నిలబడింది.

'అంటే, తాను పెళ్ళాం కావడానికి ఒప్పుకోకపోతే ఇలా వదిలేసి వెళ్ళిపోతాడా? బాధ్యతలు తీసుకోవడంలోనే బాంధవ్యం ఉంటుందా? ఈ కుటుంబం తప్ప తనకి గత్యంతరం లేదా?'

మనసంతా గజిబిజిగా ఉంది. ప్రకాష్ లాగివేసిన తలుపు ఇంకా ఊగుతూనే ఉంది.

విమల వెళ్ళి నళినికి ఫోన్ చేసింది.

"ఒక్క నిమిషం ఉంటే బయటికి పోయి ఉండే దాన్ని. ఏవిటి చెప్పూ. ఖాళీయేనా ఇవ్వాళ" అంది నళిని.

"ఏం ఖాళీనో. ప్రకాష్ ఒక సమస్య తెచ్చిపెట్టాడు. పెళ్ళి చేసుకొందాం అంటాడు." నళిని నవ్వింది.

"ఇప్పుడు చేసేది ఏవిట్టా? వాడికి చాకిరీ చేస్తూనే ఉన్నావా? వంట నువ్వేనా? ఉతుకుళ్ళూ నువ్వేనా? ఇంకా ఏవిట్టా? పిల్లల్ని కనమంటాడా?"

ఆవులించింది నళిని. విమల విసుక్కొంది.

"నువ్వు సీరియస్‌గా వినాలే. నేను పెళ్ళాడకపోతే తాను ఇంకో అమ్మాయిని పెళ్ళాడతాడట."

"పొమ్మను. నీకేం బాధ."

విమల నీళ్ళు నమిలింది.

"అది కాదే. మరి నేను ప్రకాష్ లేకుండా..."

"నీ బొంద. వాడెక్కడికి పోతాడే. నెల రోజులాగి మళ్ళీ మొదలెడతాడు."

ఎంత అసహ్యంగా ఉందో అలా మాట్లాడడం! "అసలు నా గురించి నీ అభిప్రాయం ఏమిటే."

"నిజం చెప్పనా? నీకు ఒళ్ళు కొవ్వు. ఊరికే కబుర్లు చెప్పటం బాగా వచ్చు నీకు. నీ భయం వెనక అభద్రత. హాయిగా సంపాయించుకొంటున్నావు. హాయిగా కులాసాగా బతకాలని కాంక్ష. దానికి ముసుగులు వేస్తావు. కలిసి బతుకుదాం. ఎవరి గమ్యం వారు నిర్ణయించుకొని, ఎవరి కొంపలో వాళ్ళు ఉంటూ లివ్ టుగెదర్. అంటే, ఎవడి పాటికి వాడికి ఏ నిమిషంలో అయినా దాన్ని చిన్న తన్ను తన్ని దాటి పోయే అవకాశం. ఇప్పుడు ప్రకాష్ గాడిలాగా. ఇన్నాళ్ళూ జీవితంలో స్థిరపడేదాకా, కాదు కొంప

**"మా నాన్న రిటైర్‌మెంట్ తరువాత ఆయన ఎంత తీరికైన జీవితం కోరుకొని అనుభవించాడో, ఆవిడ అంత ఇరుక్కుపోయింది... ఇల్లు ఆవిడను మింగేసింది."**

కొనుక్కొనే దాకా, ఈ మూడేళ్ళూ నువ్వు అమర్చి పెడితే ఉన్నాడు. ఇప్పుడు వాడికో పర్మనెంట్ సెటిల్‌మెంట్ కావాలి. మరి నీకు కుటుంబం, మొగుడు, వాడి చుట్టపక్కాలు వద్దు. నువ్వు మీ అమ్మా, నాయినా, అక్కచెల్లెళ్ళ కొంపలకు పోయి కావాల్సినవి నిష్పూచీగా తెచ్చుకొంటావు కానీ, నీ ఇంట్లో ఒక్క దానివే గనక ఎవరికీ ఒక్క పూట పిలిచి తిండి పెట్టే బాధ్యత లేకుండా చేసుకొన్నావు. ప్రకాష్‌గాడు కావాలి గానీ, పిల్లలూ, బాధ్యతలూ వద్దు. వాణ్ణి మోయకుండా వాడితో జీవితం కావాలి. ఏవిటిది? నువ్వు స్పష్టంగా ఉన్నావా!"

విమల మాట్లాడలేదు. పెదవులు కొరుక్కుంటూ నిలబడింది. నళిని ఇంత కంటే సున్నితంగా మాట్లాడదు. దానితో ఏదయినా మాట్లాడాలంటే ఇది భరించక తప్పదు.

అటు నుంచి నళిని నవ్వింది.

"కోపం వచ్చింది కదూ విమ్మీ. సారీ అమ్మా. ఏవిటే నీ బాధ చెప్పు."


విమల గొంతు పూడిపోయింది. నళిని మాట్లాడినదాన్లో తప్పేముంది? కుటుంబం అంటే భయం. ఆ ఊబిలో పడకుండా ఉండాలంటే అసలా దృష్టే లేకుండా ఉండాలి. కానీ, మనిషిగా తనకీ కోరికలున్నాయి. కంపానియన్‌షిప్ వద్దనుకోవడం తనకు చేత కాలేదు. తన పుట్టుక పునాది కుటుంబంలోంచే. అణిచివేతలు అర్థం అయినట్లు ఆప్యాతలూ, స్నేహం, ప్రేమ, వాత్సల్యం, బాధ్యత కూడా తనకు పరిచయం అయినవే. ఊబి భయపెట్టింది కానీ, ప్రేమ భయపెట్టలేదే. ప్రకాష్ తనతో 'విమలా, నువ్వు లేకుండా నాకు ఊహించ బుద్ధి కావడం లేదోయ్. ప్రతి నిమిషం నువ్వు జ్ఞాపకం వస్తున్నావు. ఐ లవ్ యు, ఐ వాంట్ యు' అనగానే తాను సముద్రం అయిపోయింది. కానీ, ఇద్దరి మధ్య ఉండవలసిన లిమిటేషన్స్ కొన్ని వందల సార్లు చర్చించుకొన్నారు. దొరికిపోతానని విమల భయం. దొరకదేమోనని ప్రకాష్ సంశయం. చివరికి ఇద్దరూ కలిసి చేసిన ప్రణయ స్నేహం ఇలాంటి చిక్కులు తెచ్చింది.

విమల గొంతు పూడిపోయింది. వర్షం నీళ్ళతో తడిసిన చెట్టు గాలి తగలగానే జలజలమని నీళ్ళను రాల్చినట్లు కన్నీరు ఉబికి రాబోయింది.

"నళినీ, ఇదంతా ఏదోగా ఉందే. నేను తప్పు చేశానా?"

"స్టుపిడ్. ఇవ్వాళా ఆ మాట అడగటం. ఇది కన్నీళ్ళతో, అణిచివేతలతో నలిగిన దారి. కుటుంబం ఒకళ్ళకి శిక్ష, మరొకరికి అవకాశం... ఎందుకిది మారదు? ఈ అసమానతలు ఎలా చలామణి అవుతున్నాయి అంటూ నీలాటి, నాలాటి కోట్ల మంది స్త్రీలు ప్రశ్నలు వేసుకొన్నారు. మనుషులకు ఎదిగే అవకాశాలు ఎక్కడున్నాయి? బాగా చదువుకొని, వ్యక్తులమని తెల్సుకొని మనుషుల్లా బతికేందుకు ప్రిపేరవ్వాలి. అప్పుడు కుటుంబం గురించి చర్చకు తేవాలి. ఎవరి పైన వాళ్ళకే అధికారం ఉంటే, ఎవరి పైనా ఆధారపడకుండా ఉంటే, ఆ సొంత వ్యక్తిత్వంతో అప్పుడు చేయాలి ఆలోచన."

"ఎంత కాలానికి ఇది సాధ్యం?"



నళిని విరగబడి నవ్వింది.

"మంచి ప్రశ్న. నిజం ఎంత చేదుగా ఉంటుందో ముందర తెలిసింది కదా. నువ్వు ఎంచుకొన్న దారి ఒక ప్రయోగం. దాన్ని నువ్వు విజయవంతంగా రుజువు చేయగలిగితే ఈ 'కుటుంబం' అన్న పదానికి ప్రత్యామ్నాయం చూపించగలిగితే... అప్పుడు మాట్లాడు ఇవన్నీ. సరే. ఇంక నేను పోనా."

"అలా చేతులు దులుపుకోకే నళినీ. భయంగా ఉందే."

"ఒంటరి దారి ఎప్పుడూ భయంకరమే విమలా. అందులోని కష్టనష్టాలు మనం ఒకళ్ళమే పడాలి. ఇంకొకళ్ళ సాయం ఏముంటుంది చెప్పు. అందరి లాగా కాకుండా నువ్వు ఓ కొత్త జీవిత మార్గాన్ని ఎంచుకొన్నావు. ఇప్పుడున్న దానికంటే గొప్పగా, అసమానతల మాట రాకుండా, స్వేచ్ఛగా, ముఖ్యంగా నీకు వీలుగా ఎవరి భయం లేకుండా ఉండాలనుకొన్నావు. నీకు ఉద్యోగం ఉంది. సంఘంలో నీకు సొంతంగా పేరు ప్రతిష్ఠలున్నాయి. స్వేచ్ఛ ఉంది. ఇదంతా చివరివరకూ నిలుపుకొంటూ నీ జీవితం బాగా ఉంది. నువ్వు నిరూపించ గలిగితే, ఇంకా ఎంతో మంది నీ దారిలో నడుస్తారు. అంటే, నువ్వు మార్గ దర్శకురాలివి."

"నువ్వు నన్ను వెక్కిరిస్తున్నావు." విమల ఉక్రోషంగా అంది.

"ఎలా విమలా? ఏం వెక్కిరించానో చెప్పు? నువ్వు జవాబులు కోరుకొని ప్రశ్నలు వేస్తున్నావని నేను అనుకోను. కాకపోతే నువ్వు ఆశించిన సమాధానాలు నేను చెప్పడం లేదు. నిన్ను ఓదార్చడం నా పని కాదు. నిజం నిష్ఠురంగా ఉన్నా విని తీరాలి. పోనీ నేనే కొన్ని ప్రశ్నలు వేస్తాను. నువ్వు చెప్పు, ఇవాళ్టి వరకూ నువ్వు సుఖంగా ఉన్నావా?

"ఉన్నాను."

"అభద్రత లేదా?"

"లేదు."

"ఎందుకు లేదు?"

"నేను ఆశించలేదు కనుక."

"ఇదిగో ఇక్కడే నీ ప్రశ్నకు సమాధానం ఉందమ్మా విమలా. నువ్వు ఆశించలేదు కనుక నీకు దుఃఖం లేదు. కుటుంబం ఆశిస్తుందే! నీ సేవనీ, నీ తెలివినీ, మొత్తంగా నిన్నూ తన సొంతం చేసుకొంటుంది. నీకు వ్యక్తిత్వం అప్పుడిక ఉండదు. అలా కుటుంబం ఆశించకుండా సౌజన్యం చూపిస్తే, అంటే నిన్ను కాస్త వెసులుబాటులో ఉంచగలిగితే నువ్వు మంచి భార్యగా మిగులుతావు. లేదా విడాకులు తీసుకుంటావు. మళ్ళా ఆ దారిలో నువ్వు ఒంటరిగానే విమ్మీ!" జాలిగా అంది నళిని.

"నళినీ, నేనేం నిర్ణయించుకోలేకపోతున్నా."

"సరిగ్గా ఆలోచించుకో అమ్మా." నళిని ఫోన్ పెట్టేసింది.

విమల గోడకు ఆనుకుని కిందికి జారి కూర్చుంది.

మనుషులు నమ్మకంగా ఎవరికి వాళ్ళుగా ఎందుకు ఉండలేరూ? "నళినిలా ఒంటరిగా ఉండడంలో నేను సంతోషం ఎందుకు ఫీలవలేక పోతున్నాను? ఎలా ఉంటే అందరికీ మేలు? ప్రకాష్‌ను పూర్తిగా ఆహ్వానించలేక, పోగొట్టుకోలేక నేనెందుకు క్షోభ పడుతున్నాను. భర్తలు వదిలేసిన ఇల్లాళ్ళు, మొగుళ్ళు పోయిన భార్యలు, వంచనకు గురయినవాళ్ళు ఇలాంటి దుఃఖమే అనుభవించారా? కుటుంబం అంటే ప్రకాష్ కోరుకున్న పూర్తికాలపు స్నేహమా! అది అతనికే వీలుగా, సంతోషంగా ఉంటుందని తెలిపోయాక కూడా అతని కోసం నే తపిస్తున్నానంటే అర్థం ఏమిటి?"

మనసు లోలోపల నుంచి ఉండలా చుటుకొన్న దుఃఖం పెల్లుబుకుతున్న జాడ...

'ఇంక నేను ఏడుస్తాను' అనుకుంది విమల.

విమలకు స్పష్టంగా అర్థం అయింది. తల పైన అమ్మ స్పర్శ గుర్తుకు వచ్చింది. పరీక్ష పాసయిన రోజు అన్న భుజం పట్టుకొని గారాలు పోయిన క్షణం, జ్వరంలో నాన్న చేయి తాకుతూ నిద్రపోయిన జ్ఞాపకం...

విమల కళ్ళు నిండాయి.

"ఇవన్నీ నాకు పరిచయం. ప్రేమతో పరిచయం, మానవ సంబంధాలలో ఉన్న స్నేహానుభవం, భద్రత- ఇవన్నీ నాకు తెలుసు. అందుకే ప్రకాష్‌ను వదలాలంటే నాకు భయం. అందుకే ఏడుస్తున్నా. కానీ, నాకు నన్ను బంధించే జీవితం వద్దు. నా ఉనికిని కాజేసే ఆ మాయ వల నాకొద్దు. నేను ఎదుగుతాను. స్థిరంగా నడిచి తీరతాను."

విమల ఏడవటం మొదలుపెట్టింది. మనసంతా కరిగి కన్నీళ్ళయి ప్రవహిస్తోంది. శరీరం మొత్తం కరిగి ప్రవహిస్తే, అందులో అన్ని జ్ఞాపకాలూ కొట్టుకొని పోతే...

విమల ఏడుస్తూనే ఉంది. ■

**"నాకు నన్ను బంధించే జీవితం వద్దు. నా ఉనికిని కాజేసే ఆ మాయ వల నాకొద్దు. నేను ఎదుగుతాను. స్థిరంగా నడిచి తీరతాను." విమల ఏడుస్తూనే ఉంది.**